# స్వచ్ఛంద దానధర్మాలు

# ٢ - بَابُ صَدَقَةِ التَّطَوُّعِ

508. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "ఏడు రకాల మనుషులున్నారు. ఏ రోజున అల్లాహ్ నీడ తప్ప మరొకరి ఆశ్రయం ఉండదో ఆ రోజున అల్లాహ్ వారికి ఆశ్రయం ఇస్తాడు." తరువాత హదీసు నంతటినీ వివరించారు. అందులో ఒక వాక్యం ఇలా వుంది - "ఆ ఏడుగురిలో- కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి కూడా తెలియనంత రహస్యంగా దానం చేసేవాడు కూడా ఉన్నాడు."

(బుఖారీ, ముస్లిం)

(٥٠٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**سَبْعَةٌ يُظِلُّهُمُ اللَّهُ فِي ظِلِّهِ يَوْمَ لاَ ظِلَّ إِلاَّ ظِلُّهُ**» - فَذَكَرَ الْحَدِيثَ - وَفِيهِ: «**وَرَجُلٌ تَصَدَّقَ بِصَدَقَةٍ فَأَخْفَاهَا، حَتَّى لاَ تَعْلَمَ شِمَالُهُ مَا تُنْفِقُ يَمِينُهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

## సారాంశం

ఏడు రకాల మనుషుల్లో మిగిలిన ఆరుగురు ఎవరు? అన్న ప్రశ్న ఇక్కడ జనించవచ్చు. ఆ ఆరుగురు వీరు - (1) న్యాయశీలుడైన నాయకుడు. (2) దైవారాధనలో కాలం గడిపిన యువకుడు. (3) ఎల్లప్పుడూ మస్జిద్‌లో మనసు లగ్నమై ఉండే వ్యక్తి. (4) కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో పరస్పరం ప్రేమించుకునే, కేవలం అల్లాహ్ ప్రసన్నతను బడసే సంకల్పంతోనే ఒండొకరి నుంచి వేర్పడిపోయే ఇద్దరు వ్యక్తులు. (5) అందగత్తె, కులీనురాలైన ఒక పడుచు స్త్రీ పొందు కోసం పిలువగా, తాను దైవానికి భయపడే వాడినని చెప్పి, ఆమె పిలుపును తిరస్కరించిన వ్యక్తి. (6) ఏకాంతంలో దైవధ్యానంలో నిమగ్నుడై ఉండగా దేవునిపట్ల భక్తి పారవశ్యంతో - నయనాల నుండి అశ్రుధారలు ప్రవహించే వ్యక్తి. (7) ఇక ఏడవవ్యక్తి గోప్యంగా దానధర్మాలు చేసేవాడు. ప్రదర్శనాబుద్ధికి తావీయకుండా - కేవలం దైవాన్ని సంతోషపరచే ఉద్దేశ్యంతో - సాటి మానవుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసే ధన్యుడు.

ఈ హదీసు సదఖయె వాజిబా (తప్పనిసరి దానం), సదఖయె నాఫిలా (స్వచ్ఛంద దానం) - రెంటినీ పరివేష్టించి ఉంది.

ప్రళయం ఒకనాడు తథ్యమనీ, ఆనాడు దైవ సింహాసనం తప్ప మరొక నీడ, మరో ఆశ్రయం ఉండబోదని కూడా ఈ హదీసు చాటిచెబుతోంది. ఆ సింహాసనం ఎటువంటిది? దాని నీడ ఎలా ఉంటుంది? ఆ స్థితి వర్ణనాతీతం. దాని జ్ఞానం అల్లాహ్‌కే పరిమితం.

ఈ హదీసు కేవలం పురుషులకే ప్రత్యేకమా? స్త్రీలకు ఈ అదృష్టం లేదా? అన్న ప్రశ్న కూడా ఇక్కడ ఉత్పన్నమవటం సహజం. యదార్థమేమిటంటే ఇటువంటి సుగుణాలు గల మహిళలకు కూడా ఈ హదీసు యథాతథంగా వర్తిస్తుంది.

ఫర్జ్ మరియు వాజిబ్ సదకాలు ఇస్తున్నప్పుడు వాటిని బహిరంగంగా ఇవ్వాలి. ఎందుకంటే దీనివల్ల ఇతరులను కూడా సదాచరణ వైపునకు పురికొల్పినట్లవుతుంది. అయితే స్వచ్ఛంద లేక సాధారణ దానాలను మాత్రం గోప్యంగా ఇవ్వటం మంచిదని చెప్పబడింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో స్వచ్ఛంద దాన ధర్మాలు కూడా గోప్యంగా ఇవ్వటానికి వీలుపడదు. ఎంత కాదనుకున్నా అవి బహిర్గతమవుతాయి. దాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. అయితే అటువంటి సందర్భాలలో దాత సంకల్పం బావుండాలి. నలుగురిలో పేరు ప్రఖ్యాతులను ఆర్జించే ఉద్దేశ్యంతో గాకుండా కేవలం తన ప్రభువును మెప్పించే ఉద్దేశ్యంతో దానం చేయాలి. 'చిత్తశుద్ధి' అంటే ఇదే మరి.

509. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) చెప్పారు : "ప్రతి వ్యక్తీ తన దానాల నీడలో నిలబడి ఉంటాడు. కడకు ప్రజల తీర్పు జరిగిపోతుంది."

(ఇబ్నె హిబ్బాన్, ముస్తద్రక్ హాకిమ్)

(٥٠٩) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «كُلُّ امْرِىءٍ فِي ظِلِّ صَدَقَتِهِ حَتَّى يُفْصَلَ بَيْنَ النَّاسِ». رَوَاهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

**సారాంశం**

దానధర్మాలలో ముందంజ వేసేవారి వైశిష్ట్యం ఈ హదీసులో తెలుపబడింది. ఎంత విస్తారంగా దానాలు చేసివుంటే వారి నీడ అంతగానే విస్తృతమయి ఉంటుంది. ప్రళయ దిన దృశ్యాన్ని ఓసారి ఊహించుకోండి - ఆ రోజు ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటారు. ఆనాడు ఎవరికి కాస్తంత నీడ దొరికినా అది వారి భాగ్యమే అనాలి. అతను చేసుకున్న దాన ధర్మాల నీడ ఆనాడు అతని మన్నింపు కొరకు దైవసమక్షంలో సిఫారసు చేస్తూ ఉంటుంది. స్వచ్ఛంద దానంలో వున్న మరో శుభకరమయిన కోణం ఏమిటంటే, 'సదఖయె వాజిబా'ను చెల్లించటంలో మనిషివల్ల ఏదయినా లోటు జరిగి ఉంటే ఆ లోటును ఇది పూరిస్తుంది.

(٥١٠) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: أَيُّمَا مُسْلِمٍ كَسَا مُسْلِماً ثَوْباً عَلَى عُرْيٍ كَسَاهُ اللّٰهُ مِنْ خُضْرِ الْجَنَّةِ، وَأَيُّمَا مُسْلِمٍ أَطْعَمَ مُسْلِماً عَلَى جُوعٍ أَطْعَمَهُ اللّٰهُ مِنْ ثِمَارِ الْجَنَّةِ، وَأَيُّمَا مُسْلِمٍ سَقَى مُسْلِماً عَلَى ظَمَإٍ سَقَاهُ اللّٰهُ مِنَ الرَّحِيقِ الْمَخْتُومِ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَفِيْ إِسْنَادِهِ لِينٌ.

510. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించినట్లు హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలియజేశారు: ఆయన (స) ఇలా ప్రబోధించారు - "ఏ ముస్లిం అయినా దుస్తులు లేని తన సోదరునికి దుస్తులు తొడిగిస్తే అల్లాహ్ అతనికి స్వర్గంలో పచ్చని పట్టు వస్త్రాలు తొడిగిస్తాడు. మరే ముస్లిం అయినా ఆకలితో అలమటించే తన సోదరునికి అన్నం పెడితే అల్లాహ్ అతనికి స్వర్గం లోని ఫలాలు తినిపిస్తాడు. ఇంకా ఏ ముస్లిమయినా దాహంతో బాధపడే తన సోదరునికి మంచినీరు (లేక పానీయం) త్రాగిస్తే అల్లాహ్ అతనికి స్వర్గలోకంలోని సీలు వేయబడివున్న స్వచ్ఛమయిన మద్యం త్రాపుతాడు." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. దీని పరంపర లో బలహీనత ఉంది)

**సారాంశం**

పరలోకంలో అల్లాహ్ తన దాసులకు ప్రసాదించే ప్రతిఫలం ఇహలోకంలో వారు చేసిన పనులతో సమన్వయం చెందేదిగా ఉంటుందని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే స్వర్గంలోని దుస్తులు ప్రపంచంలోని దుస్తులకన్నా ఎంతో నాణ్యంగా, అందంగా, సుతిమెత్తగా ఉంటాయి. అతడు చేసిన సత్కార్యం దైవసన్నిధిలో ఆమోదయోగ్యమయినపుడే అతనికి ఈ ప్రతిఫలం లభిస్తుంది. సదాచరణ స్వీకారయోగ్యమవటానికి రెండు షరతులున్నాయి. ఒకటి:

అది షరీయత్ కనుగుణంగా ఉండాలి. దైవప్రవక్త (స) విధానానికి విరుద్ధంగా ఉండకూడదు. రెండు: సదాచరణ వెనుక చిత్తశుద్ధి ఉండాలి. అంటే దైవప్రసన్నత పొందే సంకల్పంతో సత్కార్యం చేయాలి. దాని వెనుక ప్రదర్శనా మనస్తత్వం ఉండకూడదు.

హదీసులో ఆకలిగొన్నవారు, దుస్తులు లేనివారు, దాహంతో బాధపడేవారి ప్రస్తావన వచ్చింది. యాచించే వారి నిజ స్థితి వారి వాలకాన్ని బట్టి అర్థమైపోతుంది. అటువంటి అగత్యపరులకు, నిరాధారులకు దానాలివ్వటం మంచిదే. కాని శారీరకంగా, మానసికంగా మంచి స్థితిలో ఉండి కూడా కష్టపడకుండా సోమరుల్లా తిరిగేవారికి, వృత్తిపరమయిన (ప్రొఫెషనల్స్) ఫకీర్లకు దానం ఇవ్వకూడదు. సిసలయిన అభాగ్య జీవులకు ఇవ్వటం వల్ల సమాజంలో వారి సమస్యలు పరిష్కృత మవుతాయి. వారి అక్కరలు తీర్తాయి. ఈ ఆచరణను అల్లాహ్ ఎంతగానో మెచ్చుకుంటాడు. ప్రతిఫలంగా వారికి శాశ్వితమయిన - అనుగ్రహభరితమయిన - స్వర్గవనాలలో ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారికి సమర్పించబడే మద్యం ప్రపంచంలోని మద్యం లాంటిది కాదు. అది సీలువేయ బడిన షరాబు. పవిత్రమైన, స్వచ్ఛమయిన షరాబు. మత్తునివ్వని మద్యం. దేవుడు సమ్మతించి ఆమోదించిన (హలాల్) మద్యం.

(٥١١) وَعَنْ حَكِيمِ بْنِ حِزَامٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «اَلْيَدُ الْعُلْيَا خَيْرٌ مِنَ الْيَدِ السُّفْلَى، وَابْدَأْ بِمَنْ تَعُولُ، وَخَيْرُ الصَّدَقَةِ مَا كَانَ عَنْ ظَهْرِ غِنًى، وَمَنْ يَسْتَعْفِفْ يُعِفَّهُ اللّٰهُ، وَمَنْ يَسْتَغْنِ يُغْنِهِ اللّٰهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ،

511. హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "పై చేయి క్రింది చేయికన్నా ఉత్తమ మైనది. మీపై ఆధారపడివున్న వారితో (దానధర్మాలు) మొదలెట్టండి. మీ అవస రాలు, అక్కరలు తీరగా ఇచ్చేదే అత్యుత్త మమయిన సదఖా. ఎవరయితే ఒకరి ముందు చేయి చాచకుండా ఉంటాడో అతన్ని (అతని గౌరవమర్యాదలను) అల్లాహ్ కాపాడతాడు. ఎవరయితే పరువుగా బ్రతుకుతాడో అతనికి అల్లాహ్ స్వయం సమృద్ధి నొసగుతాడు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి)

**సారాంశం**

కుటుంబీకులు అధఃస్థితిలో వున్నప్పుడు వారి కష్టాలు తీర్చటం, వారి సమస్యలను పరిష్క రించటం కూడా సత్కార్యం క్రిందికే వస్తుంది. ఇంటి అక్కరలు తీరకుండానే బయటివారికి దాన ధర్మాలు చేయటం మంచి పద్ధతికాదు. 'ముస్లిం'లో హజ్రత్ సోబాన్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, మనిషి తన ఆలుబిడ్డలు మరియు కుటుంబీకులపై వెచ్చించే సంపదే అత్యుత్తమ సంపద. లేదా అతను దైవమార్గంలో ఖర్చు చేయాలి లేదా తన అప్తులపై, బంధుమిత్రులపై ఖర్చుపెట్టాలి.

ఈ హదీసులో సదఖా (దానం) ఇవ్వటంలోని మహత్తును గురించి చెప్పటంతోపాటు అక్కర లేకపోయినా అర్థించేవారిని సున్నితంగా మందలించటం కూడా జరిగింది. చీటికీమాటికీ తమ హీనస్థితిని ఇతరుల ముందు చాటుకోకుండా - అభిమానధనులుగా జీవించే వారి కోసం అల్లాహ్ ఉపాధి ద్వారాలను తెరుస్తాడు. ఎవరిపైనా ఆధారపడకుండా నిరపేక్షాపరులుగా జీవించే స్థితిని కల్పిస్తాడు.

(٥١٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قِيلَ: يَا رَسُولَ اللهِ! أَيُّ الصَّدَقَةِ أَفْضَلُ؟ قَالَ: **جُهْدُ الْمُقِلِّ، وَابْدَأْ بِمَنْ تَعُولُ**. أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

512. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: 'ఏ దానం శ్రేష్ఠమైనది?' అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఎవరో ప్రశ్నించగా, "తక్కువ ధనం ఉన్నవాడు చేసే దానం. నీపై ఆధారపడి ఉన్నవారి నుంచి దానాన్ని మొదలెట్టు'' అని దైవ ప్రవక్త (స) సమాధానమిచ్చారు. (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా రెండు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఒకటి: ధనికుని దానానికీ, సామాన్యుని దానానికీ మధ్య స్పష్టమయిన వ్యత్యాసం ఉంది. రెండు : ఆలుబిడ్డల, కుటుంబ సభ్యుల కనీసావసరాలు తీర్చిన మీదట దానధర్మాలు చేయాలి. తాను పరులకు దానధర్మాలు చేస్తుండగా తన ఇంటివారలు అన్యుల ముందు చేయి చాచవలసిన నికృష్టస్థితి ఏర్పడకూడదు. అందుకే ముందు తన ఇంటివారి (షరీయత్‌పరంగా) ధర్మసమ్మతమయిన అక్కరలపై శ్రద్ధ చూపాలి.

(٥١٣) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**تَصَدَّقُوا**»، فَقَالَ رَجُلٌ: يَا رَسُولَ اللهِ! عِنْدِيْ دِيْنَارٌ، قَالَ: «**تَصَدَّقْ بِهِ عَلَى نَفْسِكَ**»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ: «**تَصَدَّقْ بِهِ عَلَى وَلَدِكَ**»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ:

513. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : "దానధర్మాలు చేయండి" అని దైవప్రవక్త (సఅసం) ఉపదేశించారు. 'దైవప్రవక్తా! నా దగ్గర ఒక్క దీనార్ మాత్రమే ఉంది'అని ఒక వ్యక్తి అన్నాడు. "దాన్ని నీ స్వయం కోసమే ఖర్చుపెట్టు" అని దైవప్రవక్త (స) అన్నారు. 'మరో దీనార్ కూడా ఉంది' అని అన్నాడావ్యక్తి. "దాన్ని నీ సంతానంపై సదఖాగా వెచ్చించు'' అని ఆయన (స) సలహా

«تَصَدَّقْ بِهِ عَلَى زَوْجَتِكَ»، قَالَ: عِنْدِي آخَرُ، قَالَ: «تَصَدَّقْ بِهِ عَلَى خَادِمِكَ»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ: «أَنْتَ أَبْصَرُ بِهِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

ఇచ్చారు. 'నా దగ్గర ఇంకొకటి కూడా ఉంది' అన్నాడా వ్యక్తి. "దాన్ని నీ భార్య కొరకు ఖర్చుపెట్టు' అని సూచించా రాయన (స). 'నావద్ద ఇంకొకటి కూడా ఉంది' అని అతడు చెప్పగా "దాన్ని నీ సేవకుని కోసం ఖర్చుపెట్టు" అని ఉప దేశించారు ఆయన (స). 'దైవప్రవక్తా! నా వద్ద మరొకటి కూడా ఉందికదా!' అని అతడు సందేహపడగా, "దీన్ని ఖర్చు పెట్టే అవగాహన నీకు ఎక్కువగానే ఉంది" అని ఆయన (సఅసం) అన్నారు. (ఈ హదీసును అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు- ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే మానవుడు షరీయత్ పరిమితుల్లో ఉంటూ తొలుత తన వాళ్ల అవసరాలను తీర్చాలి. ధర్మసమ్మతమైన రీతిలో ఆలుబిడ్డల అవసరాలను తీర్చటం కూడా పుణ్యప్రదమయిన విషయమే. ఆ క్రమపద్ధతి ఇలా వుంది: ముందు తన స్వయానికై ఖర్చుపెట్టాలి. తరువాత సంతానం, భార్య, సేవకులూ వస్తారు. ఆ తరువాత తన ఇష్టమొచ్చిన వారిపై ఖర్చుపెట్టవచ్చు. లేదా భవిష్యత్తు కొరకు పొదుపు చేయవచ్చు. ఏది ఖర్చుచేసినా అతడు ఈ క్రమపద్ధతిని దృష్టిలో పెట్టుకోవాలి.

(٥١٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ النَّبِيُّ ﷺ: «إِذَا أَنْفَقَتِ الْمَرْأَةُ مِنْ طَعَامِ بَيْتِهَا، غَيْرَ مُفْسِدَةٍ، كَانَ لَهَا أَجْرُهَا بِمَا أَنْفَقَتْ، وَلِزَوْجِهَا أَجْرُهُ بِمَا اكْتَسَبَ، وَلِلْخَازِنِ مِثْلُ ذٰلِكَ، لَا يَنْقُصُ بَعْضُهُمْ مِنْ أَجْرِ بَعْضٍ شَيْئاً». مُتَّفَقٌ عَلَيْهِ.

514. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (రజి) వివరించారు - "స్త్రీ తన ఇంటి సొమ్మును దుబారాగా ఖర్చుపెట్టకుండా పొదుపును పాటిస్తే ఈ పొదుపరితనానికి బదులుగా ఆమెకు పుణ్యం లభిస్తుంది. ఆమె భర్తకు సంపాదించిన పుణ్యం లభిస్తుంది. అలాగే కోశాధికారికి కూడా పుణ్యం లభిస్తుంది. ఎవరి పుణ్యం కూడా ఇంకొకరి పుణ్యాన్ని తగ్గించదు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఒక ఉత్తమ ఇల్లాలి బాధ్యత ఏమిటో ఈ హదీసులో స్పష్టపరచబడింది. ఆమె ఎల్లప్పుడూ భర్త సంపాదనను బేరీజువేస్తూ, ఇంటి ఖర్చులను దానికనుగుణంగా సర్దుబాటు చేసుకోవాలి. దుబారా ఖర్చులు చేసి, భర్త అనుమతి లేకుండా దానధర్మాలు చేసి ఇంటి ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేయకూడదు. ఇల్లాలు ఒక్కో పద్దులో పాటించే పొదుపరితనం ఆ ఇంటిల్లిపాదికీ వరంగా పరిణమిస్తుంది. భర్తను అప్పులపాలు కాకుండా కాపాడుతుంది. అతడు నిశ్చింతగా ఉంటే బయటి వ్యవహారాలు, బాధ్యతలు సజావుగా నెరవేరుస్తాడు. ఈ విధంగా ఒక ఇల్లాలి యొక్క జాగరూకత మొత్తం వ్యవస్థ పాలిట శుభదాయకంగా పరిణమిస్తుంది. అలాగే ఒక ఇల్లాలి యొక్క అలక్ష్యం, అజాగ్రత్త మొత్తం వ్యవస్థనే అస్తవ్యస్తం చేసివేస్తుంది.

(٥١٥) وَعَنْ أَبِيْ سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَتْ زَيْنَبُ امْرَأَةُ ابْنِ مَسْعُودٍ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّكَ أَمَرْتَ الْيَومَ بِالصَّدَقَةِ، وَكَانَ عِنْدِي حُلِيٌّ لِّي، فَأَرَدْتُ أَنْ أَتَصَدَّقَ بِهِ، فَزَعَمَ ابْنُ مَسْعُودٍ أَنَّهُ وَوَلَدَهُ أَحَقُّ مَنْ تَصَدَّقْتُ بِهِ عَلَيْهِمْ، فَقَالَ النَّبِيُّ ﷺ: «صَدَقَ ابْنُ مَسْعُودٍ، زَوْجُكِ وَوَلَدُكِ أَحَقُّ مَنْ تَصَدَّقْتِ بِهِ عَلَيْهِمْ». رَوَاهُ الْبُخَارِيُّ.

515. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) గారి శ్రీమతి జైనబ్ (ర.అన్హా) వచ్చి ఇలా విన్నవించుకున్నది - "ఓ దైవప్రవక్తా (సఅసం)! ఈ రోజు మీరు దానధర్మాలు చేయమని ఆజ్ఞాపించారు. నా దగ్గర నా స్వంత నగ ఉంది. దాన్ని నేను దానంగా ఇవ్వాలనుకుంటున్నాను. నా ఈ దానానికి (సదఖాకు) తాను, తన పిల్లలు ఎక్కువ హక్కుదారులని అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) భావిస్తున్నారు (నిజమేనా?)" దానికి ఆయన (స) "ఇబ్నె మస్‌వూద్ చెప్పింది నిజమే. నీ భర్త, నీ పిల్లలు నీవిచ్చే సదఖాకు ఎక్కువ హక్కుదారులు" అని అన్నారు. (బుఖారీ)

## సారాంశం

'సదఖా' అనే అరబీ పదం చాలా విస్తృతమయింది. అది సాధారణ దానధర్మాలతోపాటు, జకాత్ నేపథ్యంలో కూడా ఉపయోగించబడుతుంది. పై హదీసులో ఇబ్నె మస్‌వూద్ (రజి) భార్య ఇవ్వదలచిన సదఖా స్వచ్ఛందమయిన సదఖా? లేక వాజిబ్ సదఖా? లేక జకాత్ మొత్తమా? అన్నది ఇక్కడ ప్రశ్న. సాధారణ సదఖా అయితే ఆమె దానికి సంబంధించి అడిగి తెలుసుకోవలసిన అవసరం లేదు. బహుశా ఇది జకాత్‌కి సంబంధించిన సదఖా (ఫర్జ్ సదఖా) అయి ఉండవచ్చు. అధిక సంఖ్యాకులైన విద్వాంసుల, ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం భార్య తన భర్తకు జకాత్ ఇవ్వవచ్చు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయంలో భార్య తన భర్తకు జకాత్ ఇవ్వజాలదు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో దైవప్రవక్త (స) ముందు ధర్మసందేహం వెలిబుచ్చిన జైనబ్ (ర.అన్హా) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) సతీమణి. ఈమె బనూ సఖీఫ్ తెగకు చెందినవారు. ఈమె తండ్రి పేరు ముఆవియ లేక అబ్దుల్లా బిన్ ముఆవియ లేక అబూ ముఆవియ. ఈమె దైవప్రవక్త(స), హజ్రత్ ఉమర్, మరియు తన భర్త ఆధారంగా హదీసులను ఉల్లేఖించారు.

(٥١٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «لَا يَزَالُ الرَّجُلُ يَسْأَلُ النَّاسَ، حَتَّى يَأْتِيَ يَوْمَ الْقِيَامَةِ، وَلَيْسَ فِي وَجْهِهِ مُزْعَةُ لَحْمٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

516. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: "ఎవరయితే భిక్షాటనను, యాచించటాన్ని వృత్తిగా చేసుకుంటారో వారు ప్రళయదినాన తమ ముఖాలపై మాంసం లేని స్థితిలో లేచివస్తారు."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ద్వారా భిక్షాటనం ఖండించబడింది. కేవలం మూడు రకాల మనుషులు మాత్రమే యాచించటం సమ్మతం. ఒకటి : ప్రకృతి వైపరీత్యాల, అవాంఛనీయ సంఘటనల వాతనపడి సర్వస్వాన్నీ కోల్పోయినవారు. తిండి తిప్పల కోసం కూడా ఏమీ మిగలనివారు. వారు తమ తాత్కాలిక అవసరాల కోసం, పునరావాసం కోసం అడగవచ్చు. అలాంటి వారి అవసరాలను అర్థం చేసుకుని ఉదారంగా ఆదుకోవాలి కూడా. రెండు: అన్యాయంగా జరిమానాకు గురైనవారు, అప్పుల ఊబిలో కూరుకుపోయినవారు. ఇలాంటి వారు ఇతరుల నుంచి అడిగి తమ దుస్థితి నుంచి బయటపడాలి. మూడు: పగలల్లా కష్టపడి పనిచేసినా కడుపునింపుకునేంత వేతనం లభించనివాడు, లేదా ఎంతగా అన్వేషించినా పని దొరకనివాడు, పరిమితమైన ఆదాయం వల్ల కుటుంబ అవసరాలు తీరనివాడు, ఆకలిదప్పులతో అలమటించేవాడు- ఇట్టి పరిస్థితిలో వారు సమాజంలోని స్థితిమంతుల నుంచి అడిగి తమ అవసరాలు తీర్చుకోవచ్చు. వీరు గాక భిక్షాటనను వృత్తిగా చేసుకున్నవారు, కష్టపడి పనిచేయగల శక్తి ఉండి కూడా ముష్టెత్తుకోవటాన్నే అలవాటుగా చేసుకున్నవారు ప్రళయదినాన అత్యంత అవమానకరమైన స్థితిలో లేపబడతారు.

(٥١٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «مَنْ سَأَلَ النَّاسَ أَمْوَالَهُمْ تَكَثُّرًا، فَإِنَّمَا يَسْأَلُ

517. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "ఎవరయితే తన సంపదను పెంచుకునే, వృద్ధిచేసుకునే ఉద్దేశ్యంతో జనుల నుండి యాచిస్తాడో అతడు తన కోసం

جَمْراً، فَلْيَسْتَقِلَّ أَوْ لِيَسْتَكْثِرْ». رَوَاهُ مُسْلِمٌ.

నిప్పులను తప్ప మరే వస్తువునూ యాచించటం లేదు. ఇప్పుడు వాటిని పెంచుకుంటాడో, తగ్గించుకుంటాడో ఇక అతని ఇష్టం." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా భిక్షాటనం అధర్మంగా ఖరారు చేయబడింది. ఆరోగ్యవంతుడు, కష్టపడి పని చేయగలవాడు, ఆర్థిక స్థోమత ఉన్నవాడు కూడా జనులవద్ద యాచిస్తే అతడు సమాజంలో తనను తాను కించపరచుకున్నట్లే. అటువంటి వారికి 'ధర్మం' చేయటం కూడా ధర్మం కాదు.

(٥١٨) وَعَنِ الزُّبَيْرِ بْنِ الْعَوَّامِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: لأَنْ يَأْخُذَ أَحَدُكُمْ حَبْلَهُ، فَيَأْتِيَ بِحُزْمَةِ الْحَطَبِ عَلَى ظَهْرِهِ، فَيَبِيعَهَا، فَيَكُفَّ بِهَا وَجْهَهُ، خَيْرٌ لَهُ مِنْ أَنْ يَسْأَلَ النَّاسَ، أَعْطَوْهُ أَوْ مَنَعُوهُ. رَوَاهُ الْبُخَارِيُّ.

518. హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీలో ఎవరయినా త్రాడుతో కట్టెల మోపుకట్టి, వీపుపై మోసుకువచ్చి, దాన్ని అమ్ముకుంటే, తద్వారా అల్లాహ్ అతని మొహాన్ని ముష్టెత్తుకోవటం నుంచి ఆపితే, అది అతని కొరకు - ఇచ్చినా ఇవ్వకపోయినా -జనుల నుంచి యాచించటం కన్నా ఎంతో ఉత్తమం." (బుఖారీ)

**సారాంశం**

కష్టపడి సంపాదించటం, కలో గంజో చెమటోడ్చిన దానితో కడుపునింపుకోవటం, యాచించి తినే స్వాదిష్టమైన ఆహారంకన్నా ఎంతో మిన్న అని ఈ హదీసు సారాంశం. యాచించే వానికి ఎంతమంచి అన్నం దొరికినా యాచించే సమయంలో అతడు పొందిన అవమానం, నలుగురిచేతా అతడు అనిపించుకున్న మాటలు సాధారణమైనవి కావు. అడుక్కోవటం వల్ల పరువు ప్రతిష్ఠలుండవు. సమాజంలో అందరూ అల్పదృష్టితో చూస్తారు. తేరగా వచ్చిపడుతున్న అన్నంవల్ల అతనిలో సోమరితనం, బద్ధకం పెంపొందుతుంది. ఇలాంటి జనం పెరిగిపోతే సమాజంలో అభివృద్ధి కూడా కుంటుపడుతుంది. భిక్షాటనం ఒక్కోసారి మనిషిలోని పౌరుషాన్ని, స్వాభిమానాన్ని చంపేసి అతన్ని దొంగతనం, దోపిడీ వంటి చెడులకు కూడా పురికొల్పుతుంది.

(٥١٩) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدَبٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «الْمَسْأَلَةُ كَدٌّ يَكُدُّ بِهَا الرَّجُلُ وَجْهَهُ، إِلاَّ أَنْ

519. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ సమురహ్ బిన్ జున్దుబ్ (రజి) తెలిపారు: "భిక్షాటనం ఒక గాయం వంటిది. దాంతో మనిషి తన ముఖాన్ని గాయపరచుకుం

يَسْأَلَ الرَّجُلُ سُلْطَاناً أَوْ فِي أَمْرٍ لاَ بُدَّ مِنْهُ».
رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

టాడు. అయితే గత్యంతరంలేక ఎవరయినా యాచిస్తే లేక రాజ్యపాల కునికి నివేదించుకుంటే అందులో తప్పు లేదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - ప్రామాణికమైన హదీసుగా కూడా ఖరారు చేశారు)

**సారాంశం**

అక్కరలేకపోయినా ఇతరుల ముందు చేయి చాపటం సమ్మతం కాదని ఈ హదీసు తాత్పర్యం. అవసరం ఉన్నవాడు కూడా రాజ్యపాలకుడ్ని, తన పై అధికారిని నివేదించుకోవాలి. అటువంటివారికి బైతుల్‌మాల్ (కోశాగారం) లో హక్కు ఉంటుంది. బైతుల్‌మాల్ నుండి అగత్యపరునికి ఏదన్నా ఇస్తే అతని హక్కు అతనికి ఇచ్చినట్లవుతుంది. అంతేగాని ఎవరూ అతనిపై ఉపకారం చేసినట్టుకాదు.